# సింగిల్ పేజీ కథలు

# కాగు

ఓ కాలంలో తళతళలాడిపోతున్న రాగి కాగుకు ఇప్పుడు నూట యాభై సంవత్సరాలు.. ఇన్ని సంవత్సరాల కఠిన శ్రమకు బాగా అరిగిపోయింది. కట్టెల పొయ్యి మీద కెక్కి వేణ్నీళ్లు కాచిచ్చి కాచిచ్చి అడుగంతా నల్లగా అయిపోయి దాని రూపమే మారిపోయింది.

ఎనభై ఏళ్ల మా అత్తగార్కి ఆ కాగంటే మహా ప్రేమే అనేకంటే వెర్రి ప్రేమనచ్చు.. దానికి తోడు ఆ కాగు శుభప్రదమైందన్న నమ్మకం. ఆమె అత్తగారు తొంభై సంవత్సరాల వరకూ జీవించినామె పుట్టింటి స్త్రీ ధనంగా తెచ్చుకున్నదిట. దాంట్లో నీళ్లు కాచి పోసుకున్న వాళ్లు దీర్ఘాయుష్మంతులవుతారన్న ఓ నమ్మకం ఆమెకు. అందుకని అది అచ్చొచ్చిందన్న మరో నమ్మకం.

హీటర్లు, గీజర్లు వచ్చేశాక కాగుతో నీళ్లు ఎవరు కాచుకుంటారు? కింద చోటు లేక అటకెక్కి కూర్చుంది. 'ఇప్పుడు కాగుతో నీళ్లు కాచుకోవడం లేదుగా దాన్ని అమ్మేద్దామంటే వినదే అత్తయ్యగారు'

"ఎవరి జోలికి రాకుండా దాని మానాన అది అటక మీద కూర్చుంటే. మీకేం బాధ? మిమ్మల్ని అన్నం పెట్టమని వేధించడం లేదుగా" అని వితండ వాదం చేస్తారు.

ఈ కాగుని పెట్టే చోటు చాలదని ఎన్నో మంచి ఇళ్లను వదిలేసుకొని ఈ పాత కొంపలోనే పడున్నాం. అది తెలుసుకుని ఇంటి ఓనరు ఏ రిపేరు చేయించకుండా ప్రతీ సంవత్సరం అద్దె మాత్రం ఖచ్చితంగా పెంచుతాడు.

ఇలాంటి పరిస్థితులలో మాకు సొంత ఇంటి యోగం పట్టింది. హోమ్‌లోన్‌లో గవర్నమెంటు కట్టిచ్చే ఫ్లాటుల లాటరీలో మొదటి నెంబరు మాకే రావడం వల్ల మాకు సొంత ఇల్లు ప్రాప్తించింది.

అద్దెకున్నవారు అని చిన్నచూపు నుంచి తప్పించుకున్నామన్న తృప్తి నాకు.

"ఏమే పద్మా కొత్తింట్లో మన కాగు పెట్టేందుకు చోటుందా?" అని అత్తయ్య బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించేసరికి నా ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లయింది.

ఇన్ని సంవత్సరాలకు కొడుక్కు సొంత ఇంట్లో ఉండే యోగం పట్టినందుకా తల్లికి సంతోషంగానే ఉంది.

పది, ఎనిమిది అడుగుల గదులుంటే ఇంట్లో నల్లగా మాడిపోయిన ఆ పెద్దకాగు లోపలకు కూడా రాలేదని మాకు తెలుసు. కానీ అత్తయ్యకు ఎలా నచ్చచెప్పడం అన్న ఆలోచనలోనే రోజులు గడిచిపోయాయి.

"పోతే పోనీలే.. అమ్మ తదనంతరమే ఇల్లు గురించి ఆలోచిద్దాము" అని ఆయన అన్నప్పుడు, అత్తయ్యే కలుగజేసుకుని "దగ్గరకొచ్చిన సంపదను ఎవరైనా వద్దంటారా? నల్లబడిపోయిన కాగుని అమ్మేద్దాం" అనడం నాకు మహా



దాశ్చర్యమనిపించింది. మా ఆయనకు అదే స్థితి.

తోపుడు బండికి యాభై రూపాయలిచ్చి కాగుని పాత్రల అంగడికి తీసికెళ్లాము. కాగుకు వీడ్కోలు చెప్పేందుకు అత్తయ్య కొట్టుకు వచ్చారు.

కొట్టువాడు కాగుకు నాలుగంగుళాలు మందంగా పట్టిన మసిని గీకేశాకే కాగుని బరువు తూస్తానని పులి, సుత్తితో వచ్చాడు.

"తరువాత ఏం చేస్తావురా అబ్బీ?" అడిగింది అత్తయ్య.

"బాగా కొట్టి ముద్దగా చేసి తూకం వేస్తాం"

"ఇదేం పాపం చేసిందనిరా చితక్కొట్టడానికి? ఈ హంతకునికియ్యద్దు నా కాగుని. తీసుకుపోదాం పదండి" అని పట్టుపట్టేసరికి చేసేది లేక ఓ యాభై రూపాయలిచ్చి కాగుని తోపుడు బండీలో వేసుకుని ఇంటికి తీసుకొచ్చాడు.

రోజులు గడుస్తున్నాయి.

ఇంటి లోన్ మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కట్టాల్సిన రోజు దగ్గర పడింది. అప్పుడు ఓ వార్తాపత్రికలో వచ్చిన ప్రకటన మా కళ్లపడింది.

'నూరు సంవత్సరాల పైబడిన 'ఆంటిక్' సామాన్లు ఏవైనప్పటికీ కొంటాము' అని సంప్రదించవలసిన ఫోను నెంబరు ఇచ్చారు. ఆ సంగతి అత్తయ్యకి చెప్పేసరికి "పాత సామాన్ల విలువ తెలిసిన వాళ్లు. జాగ్రత్తగానే చూసుకుంటారు. వెంటనే రమ్మని ఫోనుచెయ్యి"

మర్నాడే ప్రకటనిచ్చిన వాళ్లు కాగు చూసుకునేందుకు వచ్చేశారు. అత్తయ్యతో మాట్లాడి నల్లటి కాగు జాతకాన్ని రాశారు.

"అమ్మా బెంగుళూరులో ఎన్.ఎమ్.ఆర్.వి.కె. అన్న మహిళా కాలేజీలో 'శాశ్వతి' అన్న ఓ మ్యూసియమ్‌లాంటిది ఉంది. అందులో ఆ కాలంలో వాడిన తిరగళ్లు, కుంపట్లు, లక్కపిడతలు, చందనం బొమ్మలు అని నూరేళ్ల కిందట వాడిన పాత సామాన్లంతటిని కలెక్ట్ చేసుకొచ్చి పెట్టారు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ సి.ఎన్.మంగళగారు. మీరిచ్చే ఈ కాగు మసినంతా శుభ్రంగా తోమేసి 'శాశ్వతి' మ్యూసియంలో పెడతాము" అన్న నిర్వాహకుని మాటలు అత్తయ్యకెంతగానో నచ్చి తృప్తినిచ్చాయి.

ఆయన మా అత్తగారి చేతులు పట్టుకుని "బామ్మగారూ మీ కాగే ఇప్పుడు మా శాశ్వతి మ్యూజియంలోని 'ఆంటిక్' సామాన్లలో అతి ప్రాచీనమైనది, ఎక్కువ వయసైనదీను. మీ కాగుకు మేము అయిదు వేల రూపాయలు ఇస్తాము. అంతకంటే ఎక్కువ కావాలనుకున్నా మేము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము" అన్నాడాయన.

అత్తయ్య అన్నది "ఇదిగో చూడు బాబూ తరతరాలుగా మంగళ కార్యాలకని నీళ్లు కాచుకున్న కాగుని కొట్టి ముక్కలు చెయ్యడానికి నా కంఠంలో ప్రాణాలున్నంత వరకూ ఒప్పుకోను. పూర్తిగా కాగు రూపంలోనే ఉండాలి. నాకెప్పుడు రావడానికి వీలుపడుతుందో అప్పుడు నేను మీ మ్యూసియానికొచ్చి ఈ కాగుని చూసేందుకు అనుమతిస్తే చాలు!" అని ఆమె అన్నప్పుడు మేము మాత్రమే కాదు, మాతో పాటు ఆ నిర్వాహకుడు కూడా స్పందించాడు.

"మామ్మగారూ ఎప్పుడు మీకు మీ కాగు చూడాలనిపిస్తే అప్పుడు మీ అబ్బాయి చేత ఓ ఫోను చేయించండి. నేనే వచ్చి బెంగుళూరు తీసికెళ్లి మా శాశ్వతిలో పెట్టిన మీ కాగుని చూపించి మళ్లీ తీసుకొచ్చి దించి వెడతాను" అనడం అత్తయ్యకు పరమానందంగా ఉంది.

కాగుకు పట్టిన మసంతా గీకేశాక అక్కడక్కడ చిన్న చిన్న సొట్టలున్నా ఉదయించే సూర్యునిలా ధగధగా మెరిసిపోతూ రాగి కాగు తన మెడలో తన వయసుని చెప్పే కార్డుని నీలంరంగు పట్టుదారంతో గుచ్చి వేసుకుని 'ఆంటిక్' సామాన్ల రాణిలా గంభీరంగా ఆశీనురాలైంది శాశ్వతి మ్యూజియంలో.

అత్తయ్య గట్టి పట్టుదలగా ఉండకపోతే ఇలాంటి సింహాసనం మీద కాగు ఆశీనురాలయ్యేది కాదు.

-ఎ.సువర్ణ (బెంగుళూరు)